# అస్పష్ట వేకువ

-గోపాలుని జయరాజచంద్ర

రాత్రి కురిసిన మంచుకి దట్టంగా తడిసిన రాళ్ళ మీద సూర్యకిరణాలు పడి చల్లగా ప్రకాశిస్తున్నాయి. చెరువులోని ఎర్రకలువల పరిమళం పరిసరాలలో వున్న పచ్చదనం మీదుగా ప్రసరించి గాలితేమలో లేతగా ప్రవహిస్తోంది. దాంతో అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

ఇంటిముందున్న సిట్ అవుట్‌లో కూర్చుని పాలు తాగుతున్నాడు నిర్మల్. వాతావరణంలోని ప్రశాంతతని అనుభవిస్తూన్నా అతని బుర్రలోని ఒక కంపార్టుమెంటంతా ఆలోచనలతో నిండిపోయింది.

గంట ముందుగా బయల్దేరి దారిలో తనకి క్లాస్ బుక్స్ కొనిపెట్టి స్కూలు దగ్గర దించేస్తానన్నాడు నాన్న. ఆరో క్లాసులో కూడా ఫస్టుర్యాంకే తెచ్చుకుంటే మంచి గిఫ్టు కొనిబెడతానని వుత్తరం రాశాడు తాతయ్య. సెలవులకి తాతయ్య దగ్గరకి పంపిస్తానని ప్రామిస్ కూడా చేశాడు నాన్న. మధ్యమధ్యలో తండ్రి పడుకున్న గది వంకే మార్చి మార్చి తలతిప్పి చూస్తున్నాడు అసహనంగా.

సత్యమూర్తి ఇంకా నిద్రలేవలేదు. సునీత కత్తిపీట ముందేసుకుని కూరగాయలు తరుగుతోంది.

గదులు వూడ్చిన కసువు బయట పారబోసిన తర్వాత వెళ్ళొస్తానని చెప్పి తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది పనిమనిషి.

అసహనంగానే కుర్చీలోనే ఇటూ అటూ కదులుతూ ఆలోచనలకి దాసోహం చేస్తున్నాడు నిర్మల్.

ఇంతలో సత్యమూర్తి నిద్రలేచి తిన్నగా బాత్‌రూమ్ లోకి వెళ్ళిపోయాడు.

నిద్రలేచిన తండ్రిని చూడంగానే నిర్మల్ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. తండ్రి కోసం వుషారుగా ఎదురుచూస్తూ కూర్చున్నాడు. బాత్‌రూములోంచి బయట కొచ్చిన సత్యమూర్తి కొడుకు పక్కనే కూర్చున్నాడు. భర్తకి కాఫీ కప్పు అందించిన సునీత తిరిగి కత్తిపీట దగ్గరే సెటిల్ అయింది.

''త్వరగా స్నానం చేసి డ్రెస్ చేసుకుంటే నాతో వద్దువుగాని'' కొడుక్కి చెప్పి పేపరు చదవడంలో నిమగ్నమయిపోయాడు సత్యమూర్తి.

కాసేపటి తర్వాత స్నానం చేసి హుషారుగా బాత్‌రూములోంచి బయటకొచ్చిన నిర్మల్‌కి నిరాశే ఎదురయింది.

హాల్లో వాతావరణం అంతా భిన్నంగా వుంది.

ఉదయం నిద్రలేచినప్పుడు వున్న ప్రశాంతత కనబడటం లేదు. అతనికి ఏదో తేడా కనబడుతోంది.

తండ్రికి ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి కూర్చొని వున్నాడు. ఇంతకు ముందెప్పుడూ ఆయన్ని చూసిన జ్ఞాపకం లేదు నిర్మల్‌కి. కాస్తదూరంగా తల్లి కూర్చొని వుంది. ఆమె పక్కనే వున్న కత్తిపీట ముందు సగం తరిగిన కూరముక్కలు పడివున్నాయి.

వాళ్ళ ముగ్గురి ముఖాల్లో వెలుగు లేదు. ఏదో దిగులు సరస్సు ప్రవహిస్తోన్నట్లుగా వున్నాయి వాళ్ళముఖాలు. నిర్మల్‌కి వాళ్ళ మాటలు పూర్తిగా బోధపడటం లేదు. తండ్రి ఆఫీసులో పనిచేసే ప్రకాశం అనే ఆయన రాత్రి చనిపోయాడని, చాలా సంవత్సరాలు పక్క పక్క వాటాల్లోనే అందరం కలిసి అద్దెకు వుండేవాళ్ళమని అర్థమయింది నిర్మల్‌కి. చనిపోవడం అంటే ఏమిటో తెలీలేదు అతనికి. వెంటనే తండ్రి ముఖంలోకి చూశాడు-

ఏదో షాక్ తిన్నట్లుగా వున్నాయి చూపులు. తన తండ్రి ముఖం అలా ఎందుకు వుందో అంతుబట్టడం లేదు నిర్మల్‌కి. ఆత్రుతని అణుచుకోలేక వెంటనే తల్లి వంక చూశాడు. ఆమె కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి. చూపుల్లో విచారాన్ని, విషాదాన్ని వెదజల్లుతోంది.

'వాళ్ళ ముఖాలు అలా ఎందుకు మారాయి? తెలిసిన వాళ్ళు ఎవరైనా మరణిస్తే అలానే వుంటారా? మరణించడం అంటే అసలు అర్థం ఏమిటి?' అర్థంకాక దిక్కుల్ని శోధించాయి నిర్మల్ చూపులు.

'చనిపోవడం అంటే ఏంటి? అసలు ఎవరైనా ఎందుకు చనిపోతారు? ఎలా చనిపోతారు?' గదిలోని గాలంతా అతని ప్రశ్నలతో నిండిపోయింది.

ఎవరిని అడగాలో తెలీక, తేల్చుకోలేక ఇటూ అటూ పిచ్చిగా తల తిప్పిచూశాడు. ప్రశ్నార్థకాలతోనే సున్నితమయిన తన చిన్న ముఖాన్ని గది గోడలకి వేలాడదీసుకున్నాడు నిర్మల్.

గదిలో మిగతా ముగ్గురూ, దగ్గర దగ్గరా కూర్చీలు లాక్కుని సీరియస్‌గా ఏదో మాట్లాడుకుంటున్నారు. అక్కడేవున్న నిర్మల్‌కి మాత్రం ఒక్కముక్క కూడా అంతుబట్టడం లేదు. అతని బుల్లి మనసుకు పట్టుకుని వేళ్ళాడుతున్న ప్రశ్నల గూళ్ళలో వాళ్ళ ముఖాలు చిన్ని చిన్ని పురుగుల్లా గోచరిస్తున్నాయి. మనసులోని ప్రశ్నలకి వాళ్ళెవరూ సమాధానం చెప్పే స్థితిలో లేరని తేలిపోయింది అతనికి. బుర్రని పట్టుకుని కుదిపేస్తున్న ప్రశ్నలకి సమాధానం దొరికితేగానీ అతని మనస్సు కుదుట పడేట్లు లేదు. పరిస్థితి అంతా అగమ్యగోచరంగా వుంది.

ప్రకాశం మరణం గురించి మాట్లాడుకుంటున్నారేకానీ మధ్యలో తెలీని నిశ్శబ్దం, స్తబ్దత ఆవరించింది వాళ్ళని. ఏదో తెలీని ఏకాంతం అలుముకుంది ముగ్గురినీ.

నవ్వుతూ కేరింతలు కొడుతూ ఆడుతూ పాడుతూ తిరిగే నిర్మల్‌కి వారంతా అలా డల్‌గా వుండిపోయేసరికి ఏం చేయాలో తోచక బయటకివెళ్ళి నిలబడ్డాడు.

రోజూ అందంగా అగుపించే పూలకుండీల్లోని మొక్కలు చాలా వికృతంగా కనిపించాయి అతనికి. గులాబీ మొక్కవున్న కుండీలో ఓ బుల్లి గులకరాయి పడివుంది. తెల్లగా చూడ్డానికి ఎంతో ఆకర్షణీయంగా వుంది. వంగి చూసి దాన్ని చేతిలోకి తీసుకున్నాడు నిర్మల్. కాసేపు దాని వంకే తేరిపార చూశాడు. మనసులోని ప్రశ్నలకి సమాధానం లభించలేదు అతనికి. నిరాశగా నేలమీద జార విడిచాడు.


కాసేపటి తర్వాత మరణవార్త మోసుకొచ్చిన వ్యక్తి వెళ్ళిపోయాడు. తరిగిన కూరముక్కల్ని తరిగిన కూర ముక్కల్ని తీసుకుని వంటింట్లోకి వెళ్ళబోయింది సునీత-

''మనం ఒక్కసారి ప్రకాశం ఇంటికి వెళ్ళొద్దాము. ఇప్పటికే ఆఫీసు వాళ్ళందరూ వెళ్ళివుంటారు.'' అన్నాడు సత్యమూర్తి భార్యనుద్దేశించి.

''అయితే ఈరోజు మీరు ఆఫీసుకి వెళ్ళడం లేదా?'' అనుమానంగా అడిగింది సునీత.

''ప్చ్...లేదు! ఆఫీసంతా ఈపాటికి ప్రకాశం ఇంటికే చేరుకుని వుంటారు. అదీకాకుండా ప్రకాశమూ నేనూ దాదాపు పదేళ్ళు ఒకే సెక్షన్‌లో కలిసి పనిచేశాము కూడా.

**కథలపోటీ మానవ సంబంధాల విభాగంలో కన్సొలేషన్ బహుమతి (రూ.1,250) కథ**



ఏముఖం పెట్టుకుని ఆఫీసుకు వెళ్ళమంటావు నన్ను?'' తిరిగి ప్రశ్నించాడు సత్యమూర్తి.

సమాధానం చెప్పకుండా అక్కడ నుంచి వెళ్లిపోయింది సునీత.

కిటికీ అవతల నుంచి సంభాషణంతా వింటున్న నిర్మల్‌కి ఈసారి కూడా ఏమీ బోధపడలేదు.

బెడ్‌రూములోకి వెళ్ళిన సత్యమూర్తి అక్కడ నుంచే ''నా రెడ్ కలర్ టిషర్టు ఎక్కడుంద''ని పెద్దగాకేక పెట్టాడు.

''బీరువాలో రెండో అరలో వుంది...! అయినా నేను డ్రెస్ మార్చుకోవాలి. ఒక్క నిముషం ఆగండి. కూర తాలింపు వేసి వచ్చేస్తాను. రాత్రి కయినా వుపయోగపడుతుంది.'' సమాధానంగా కేకేసి చెప్పింది సునీత.

''దానికిందకి వైట్ ఫ్యాంటు వేసుకోమంటావా?'' అని అప్పుడే బెడ్‌రూములో కొచ్చిన సునీతనడిగాడు సత్యమూర్తి.

''చాలా పర్‌ఫెక్టుగా మ్యాచ్ అవుతుంది'' వేసుకోమంది.

వేసుకోవలసిన బట్టల గురించి వారిరువురూ నొకరినొకరు సంప్రదించుకోవడం ఆశ్చర్యమనిపించింది

## కథలపోటీ మానవ సంబంధాల విభాగంలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథా రచయిత గోపాలుని జయరాజచంద్ర



వివిధ వారపత్రికలలో బహుమతిలం దుకున్నాను. ఆంధ్రభూమిలో మాత్రం ఇదే ప్రథమం. నా ధన్యవాదాలు. అంతకుమించి చెప్పుకోదగ్గ సాహిత్యగతం లేదు. నిర్వీర్యమయిపోతున్న మానవ సంబంధాల శిశిరంలో రాలే చెట్ల ఆకులకు నీడలూ, ఛాయలూ, పరిచయాలూను! సింధువువంటి దక్షిణ మధ్య రైల్వేలో ఓ చిన్న బిందువుని. పారడాక్స్ ఏంటంటే-విద్యార్థి దశలో 'వాణిజ్య బ్రహ్మచర్యం'లో పట్టాపుచ్చుకున్నా పిదప వివాహం అనివార్యమయింది. భార్య, ఇద్దరు పిల్లలు, ఒక ఫ్రెండ్ మిత్రులే జీవితం.

-గోపాలుని జయరాజచంద్ర.

నిర్మల్‌కి.

''ఇంతకీ నువ్వే చీర కట్టుకుందామనుకుంటున్నావు-''తన తల్లి ఎప్పుడు ఏమి అడిగినా సక్రమంగా సమాధానం చెప్పని తండ్రి ప్రవర్తన ఆరోజు ఎందుకో వింతగా వుంది నిర్మల్‌కి. బయట వాతావరణంలో క్రమేణా మార్పు వస్తోంది. చిన్నగా వేడెక్కుతోంది. ఏవేవో రహస్యాక్షరాలు మాటల రూపం దాల్చి నిర్మల్‌ని అంతర్మథనానికి గురిచేస్తున్నాయి.

'కాసేపటి క్రితం వరకూ వాళ్ళముఖాల్లో తాండవమాడిన ఆదుర్దా ఎంత వింతగా అంతర్ధానమయిపోయింది. క్షణంలో ఇంత మార్పా?' అనుకున్నాడు.

''-కిందటి సారి నీ పుట్టినరోజుకని కొనుక్కున్నావే నీలంరంగు పువ్వుల జరీ అంచు చీరా లేకపోతే పండక్కని కొనుక్కున్నావే గచ్చకాయరంగు మీద గవ్వలు కుట్టిందా?'' సునీతని అడిగాడు సత్యమూర్తి.

''ఏమో! ఇంకా నిర్ణయించుకోలేదు.''

''నీలం చీర అయితేనే బాగుంటుంది నీకు''

''-ఏమో బాబూ! ఈ మధ్య చాలాసార్లు వాళ్ళింటికి వెళ్ళినప్పుడల్లా ఆ చీరే కట్టుకోవాల్సి వచ్చింధి. బాగోదేమో?''-

''నాకుమాత్రం ఆ చీరలోనే నువ్వు ఎంతో అందంగా వుంటావు తెలుసా?''

''ఆ విషయం ఇంతకుముందెప్పుడూ చెప్పలేదే మీరు?''

''ఇప్పుడు చెబుతున్నాను కదా!''

''.....మీ ఆఫీసు వాళ్ళందరూ అక్కడుంటారనా?''

సంభాషణంతా వింటున్న నిర్మల్ మనసులో ఉదయం నాటుకున్న ఆలోచనాంకురాలు మొక్కలయి వట వృక్షాలవుతున్నాయి. మరోపక్క వుదయం నుంచీ అతని మనసును ఆక్రమించుకుని ప్రకంపిస్తున్న ప్రశ్నలు తుదకు తీరం దొరక్కవానలై వరదలై పారుతున్నాయి.

''నేను షూస్ వేసుకోనా? చెప్పులు సరిపోతాయంటావా?'' మరోసారి సునీతను ప్రశ్నించాడు సత్యమూర్తి.

''ఒకవేళ మీరు కూడా శ్మశానానికి వెళ్ళాల్సి వస్తుందేమో కదా? పైగా అవి కొత్తవి కూడాను. చెప్పులు వేసుకుని వెళితేనే మంచిదేమో!'' సమాధానం చెప్పింది సునీత.

తల్లిదండ్రులు పరస్పరం కురిపించుకునే ఆప్యాయతానురాగాలు నిర్మల్‌ని సందిగ్ధంలో పడేస్తున్నాయి. అర్థం కాక సతమతమవుతున్నాడు.

''ముందుగా నేను వెళతాను. నువ్వూ, నిర్మల్ వెనకాల రండి.'' అని బయల్దేరడానికి వుపక్రమించాడు సత్యమూర్తి.

భర్తమాటలకు సునీత వెంటనే ప్రతిస్పందించి-''మేం కూడా మీతోనే వస్తాము. మీరొక వేళ శ్మశానానికి వెళ్ళాల్సి వస్తే అక్కడ నుంచే తిన్నగా ఇంటికి వచ్చేయండి.'' అంటూనే త్వరత్వరగా బయలుదేరింది.

వాళ్ళతో బాటే నడుస్తున్నాడు నిర్మల్.

దారిపొడుగునా ప్రకాశం మరణం గురించి అతని కుటుంబం గురించే జాలి కురిపిస్తూ మాట్లాడుకున్నారు.

అక్కడకు వెళ్ళిన తర్వాత కళ్ళనీళ్ళు పెట్టుకోడానికి వీళ్ళు వేసే రిహార్సల్స్‌లా అనిపించింది నిర్మల్‌కి

★ ★ ★

ప్రకాశం శవాన్ని వాకిట్లో బల్లమీద పడుకోబెట్టారు. పక్కనే గుమిగూడి నిలబడ్డారు ఆఫీసు వాళ్ళందరూ. అక్కడే ఆగిపోయాడు సత్యమూర్తి. నిర్మల్ కూడా తండ్రి పక్కనే నిలబడి ప్రకాశం గారి శవాన్ని పరీక్షగా చూశాడు. అంతా కొత్తకొత్తగా అనిపించింది అతనికి.

ప్రకాశంగారి చేతి బొటన వేళ్ళనీ కాలిబొటన వేళ్ళనీ చిన్న చిన్న గుడ్డముక్కలతో కట్టేశారు.

''నొప్పి పెట్టవాఏంటి? అలా కట్టేశారు?'' అనుకుని మనసులోని ప్రశ్నలకి సమాధానం కోసం మూసివున్న శవం కళ్ళలో గాలించాడు. ఈసారి కూడా అసంతృప్తినే ఆశ్రయించాల్సి వచ్చింది.

ప్రకాశం భార్యను పలకరించడానికని లోపలికెళ్ళింది సునీత.

నిర్మల్ కూడా మౌనంగా తల్లిని అనుసరించాడు. అప్పటి వరకూ నిశ్శబ్దంగా వున్న గదిలోకి వీళ్ళు వెళ్ళగానే ఏడుపులు మొదలయ్యాయి. సునీత కూడా వాళ్ళతో శృతి కలిపింది. ఒక్కసారి గదంతా శోకాలతో నిండిపోయింది. క్రమంగా గదిలోని నిశ్శబ్దం నీడలా నిష్క్రమించింది.

మనుష్యుల అంతర్దృష్టి అర్థంకాని నిర్మల్ మనసు విశ్రమించడం లేదు. వికసించడం లేదు. ఇబ్బందిగా ఫీలయి శాశ్వతంగా శయనించిన ప్రకాశం గారినే మరలా చూడాలనిపించి బయటకు వచ్చేసాడు. దూరంగా కిటికీ అవతల రెండు మడత మంచాలు కనిపించాయి. వాటి మీద రెండు ఆకారాలు పడి వున్నాయి చాపలుంగల్లో చుట్టినట్లుగా. పై నుంచి కిందవరకూ ముసుగు కప్పుకుని వున్నాయి. వాళ్ళని చూడంగానే 'వింత' అనిపించింది నిర్మల్‌కి.


ఇంట్లోంచి వినపడుతున్న రోదనలు ఆ ఆకారాల్ని అంగుళం




### క(న)ష్టాల్లో ఎబిసియల్?

అమితాబ్ బచ్చన్ భారీ లెవెల్లో ప్రారంభించిన 'అమితాబ్ బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్' సంస్థ ఇప్పుడు పీకలలోతు నష్టాల్లో మునిగి వుందని ట్రేడ్ పండితులు చెప్పుకుంటున్నారు. చిత్రనిర్మాణం, పంపిణీ, ఆడియో కాసెట్ మార్కెటింగ్, ప్రాంతీయ భాషల్లో చిత్ర నిర్మాణం- ఒక్కటేమిటి జోరు జోరుగా వివిధ వ్యాపారాల్లోకి దిగి ఇప్పుడు నష్టాల్లోకి కూరుకున్నదట. ఆ నష్టాల్ని కొంతవరకైనా పూడ్చడానికా అన్నట్టు ఎబిసియల్ చిత్రం 'మృత్యుదాతా'లో ప్రధాన పాత్రని అమితాబ్ పోషించినా ఆ చిత్రం ప్రేక్షకుల్ని అంతగా ఆకట్టుకున్న దాఖలాలు కనిపించడంలేదు. ఆమధ్య నిర్వహించిన 'మిస్ వరల్డ్' పోటీల ద్వారా కూడా ఎబిసియల్ భారీగా నష్టపోయినట్టు చెబుతున్నారు. మరి ఈ కష్టాల్లోంచి ఎబిసియల్ బయటపడేదెప్పుడో?

-జె.ఎం.




కూడా కదిలించలేకపోయ్యాయి. తలతిప్పి పడుకున్న ప్రకాశం గారి వంక చూశాడు. చలనం లేకుండా పడివున్నారు. నిద్రపోయేటప్పుడు తప్ప మనుషులలా నిశ్చలనుగా పడివుండటం నిర్మల్ ఎప్పుడూ చూడలేదు.

బతకడం, చావడం, నిద్రపోవడం, ప్రాణంపోవడం-మాటలకు అర్థాలు తెలీక అనాలోచితంగా నిలబడిపోయాడు. పక్కనే కూర్చున్న తండ్రితో ఆఫీసువాళ్ళు చేసే సంభాషణ కూడా నిర్మల్‌లో నిశ్చలనానికి ప్రోది చేసింది. ప్రమోషను, ఇంక్రిమెంటు, కరువుభత్యం, బోనస్-అర్థాలు బోధపడక శూన్యంలోకి చూస్తూ నిలబడ్డాడు.

కాసేపటి తర్వాత విసుగనిపించి మళ్ళీ లోపలికెళ్ళాడు. ప్రకాశం గారి భార్య నేలమీద తల ఆన్చి పడుకుని వుంది. ఆమె కళ్ళు నిశ్చలంగా వున్నాయి. ఆమె చుట్టుపక్కల కూర్చున్న ఆడవాళ్ళందరూ ఏవేవో మాట్లాడుకుంటున్నారు.

ఇందాకతను లోపలికి వచ్చినప్పటికీ ఇప్పటికీ ఏదో తేడా వుందనిపించింది అతనికి.

పక్కనే వున్న గదిలో ఇద్దరు ఆడంగులు వాళ్ళ వాళ్ళ పెనిముట్లతో ఏవో మంతనాలు సాగిస్తున్నారు.

'సింగారం, బంగారం' వాళ్ళ మాటల్లో వినబడుతున్నాయి. బయట రిక్షా ఆగిన చప్పుడయితే కిటికీలోంచి తొంగి చూశాడు నిర్మల్.

పెద్దపెద్దగా ఏడుపులయితే వినబడ్డాయి కానీ వాటి తాలూకు శరీరాలు కనబడటం లేదు. వాటి కోసం నిర్మల్ కళ్ళు తీవ్రంగా వెదికాయి. కాసేపటి తర్వాత రెండు శరీరాలు నోటితోనే శోకశబ్దాలు చేసుకుంటూ వస్తున్నాయి. ఆ శబ్దానికి నిర్మల్ చెవుల్లో ప్రకంపనలు పుట్టాయి. ఒక్క క్షణం భయమేసింది అతనికి.

శబ్దంతోపాటు శరీరాలు కూడా సమీపిస్తుండగానే అప్పటి వరకూ విశ్రమించిన ప్రకాశంగారి భార్య లేచి కూర్చుంది. వాళ్ళతో శృతి కలిపింది. పక్కనే వున్న ఆడవాళ్ళు కూడా తమవంతు కృషి చేశారు.

'ఎవరైనా వచ్చినప్పుడేమో ఏడుస్తారు. వాళ్ళు వెళ్ళిపోగానే మామూలుగా అయిపోతారేమిటి వీళ్ళు? ఎందుకిలా ప్రవర్తిస్తారు?'-సమాధానామృతం కోసం ఆలోచనలని మరలా మధించసాగాడు నిర్మల్. ఫలితం శూన్యం.

ఇంతలో బయట కలకలం వినబడటంతో ఒక్క పరుగున బయటకు వెళ్ళాడు.

శవం దగ్గరగా ఎవరో ఇద్దరు నిలుచుని ఏవేవో వొప్పచెబుతున్నారు. అయితే ఈసారి ప్రకాశం గారిని గోడకి జారగిల పరచి కూర్చోబెట్టారు. 'ఏవో అర్థంకాని సంస్కృత శ్లోకాలు చదువుతున్నారనిపించింది' నిర్మల్‌కి.

తతంగమంతా పూర్తయిన పిదప శవాన్ని తీసుకుని వెళ్ళడానికి ఆయత్తమయ్యారు.

లోపలిగదిలో శోకస్థాయి పెరిగింది. ఈలోపల ఎవరో నలుగురు మొగవాళ్ళు వచ్చారు. హడావుడిగా స్కూటర్లు దిగి ప్రకాశంగారి శవానికి పూలదండలు వేశారు.

'దండలో గులాబీలు ఎంత అందంగా వున్నాయో' అనుకున్నాడు నిర్మల్. వెంటనే దూరంగా నిలుచున్న ఆడవాళ్ళ వొంక చూశాడు. వాళ్ళతలల్లో కూడా అదేమాదిరి గులాబీలు కనిపించాయి. ఆలోచనలో పొంతన కుదరక గట్టిగా పెదిమ కొరుక్కున్నాడు అతను.

స్కూటర్ల మీద వచ్చినవాళ్ళు ''-అమర్‌రహే....జోహార్'' అంటూ బిగ్గరగా నినాదాలు చేసి తాము వచ్చిన పని అయిపోయిం దన్నట్లుగా నిష్క్రమించారు.

'వాళ్ళంతా పెద్దగా అరుస్తూంటే ప్రకాశంగారికి మెళకువ వచ్చి కళ్ళు తెరుస్తారేమోన'ని ఆత్రుతగా ఆయన వొంక చూశాడు నిర్మల్. ప్రశాంతంగా గోడకి జారగిలబడి కూర్చు నివున్నారాయన. కొంచమయినా కదలిక లేదు ఆయనలో.

శవాన్ని వ్యానులోకి ఎక్కించారు. పరిసర ప్రాంతమంతా శోకసముద్రం ప్రవహిస్తోంది.

వ్యానుమెల్లగా కదిలింది.

ఉదయం నుంచీ శవం తలాపుదిక్కున పెట్టిన దీపాన్ని ఆర్పేసింది చీ ఛాయున్నాయికావ్...కావ్...కావ్...కావ్...కావ్...కావ్.. .మన్న శబ్దం వినబడి తలతిప్పి చూశాడు నిర్మల్.

ప్రహరీగోడ మీద నల్లని బోర్డర్‌లావుంది కాకుల గుంపు.

వాటివొంక పరీక్షగా చూశాడు పదకొండు సంవత్సరాల నిర్మల్.

ఒకకాకి ముఖంలో దిగులు, మరోకాకి ముఖంలో ఆనందం. ఒకకాకి ముఖంలో గోప్యం. పక్కనే వున్న రెండు కాకుల ముఖాల్లో గాంభీర్యం. మరోకాకి ముఖంలో నటన. ఆ వెనకనే వున్న కాకిముఖంలో వ్యంగ్యం గోచరించాయి.

ప్రవహించే కాలం నదిలో నిర్మల్ ఆలోచనలు బుల్లి బుల్లి కాగితం పడవలై కొట్టుకుపోతున్నాయి.

★



## తమిళంలో వాణీ విశ్వనాథ్

మలయాళీ అమ్మాయి అయినా కూడా తెలుగులో బిజీ హీరోయిన్‌గా ఒకప్పుడు బాగా రాణించిన వాణీ విశ్వనాథ్ ఇప్పుడు తెలుగు తెరపై కనిపించడం లేదు. ఆ మధ్య కొన్ని మలయాళ చిత్రాల్లో నటించినా కూడా ఇటీవల ఆమె నటించిన తమిళ చిత్రం 'మై ఇండియా' ఆమెకి మంచి పేరుని తెచ్చి పెట్టేలా వుంది. తమిళనాడు ప్రభుత్వం ఈ చిత్రానికి టాక్స్ మినహాయింపునిచ్చినట్టు వార్త. గ్లామరస్ హీరోయిన్‌గా పేరున్న వాణి ఇలాంటి దేశభక్తి చిత్రంలో నటించడం విశేషంగానే చెప్పుకోవాలి. ఈ సినిమా తెలుగులోకి అనువాదం ఎలాగూ అవుతుంది. కాబట్టి చాలా కాలం తర్వాత వాణీని తెలుగు తెరపై చూడవచ్చు.

-జె.ఎం.